సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



ఏజెన్సీలో విజృంభిస్తున్న వ్యాధులు
ఏలూరు జిల్లాలోని ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించడంతో వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. 8లో ▸



పెళ్లి సందడి షురూ
శ్రావణమాసం ప్రారంభం కానుండటంతో ఈ నెలలో వివాహాది శుభకార్యాలు మొదలవనున్నాయి. 7వ తేదీ నుంచి 28 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. 8లో ▸



చోరీకి వచ్చి అత్యాచారం
పాలకొల్లులో ఓ ఇంట్లో చోరీకి వచ్చిన దొంగ వృద్ధురాలిని హత్య చేసేందుకు ప్రయత్నించడమే ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. 8లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్‌కు అర్చకుల వేద ఆశీర్వచనం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవాని ప్రసాద్ శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.

సబ్సిడీపై బిందు సేద్య పరికరాలు

భీమవరం: జిల్లాలో సూక్ష్మ సేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీపై పొందడానికి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదుచేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరభద్రరావు తెలిపారు. జిల్లాకు ప్రస్తుత సంవత్సరానికి 1,500 హెక్టార్లు భౌతిక లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. అన్నిరకాల పండ్లు, కూరగాయలు, పూలతోటలకు రాయితీపై ఈ పరికరాలు అందిస్తారన్నారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాలు పైబడి పన్నెండున్నర ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీపై పరికరాలు అందిస్తామన్నారు. వీటి కోసం రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు జతచేసి దగ్గరలోని రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యానవన సహాయకులకు అందించాలని వీరభద్రరావు తెలిపారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



స్వాతంత్య్ర దినోత్సవాల నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి


భీమవరం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవాల నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ జేసీ జె.ఉదయభాస్కరరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరేడ్ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ, వేదిక ఏర్పాట్లను రెవిన్యూ డివిజనల్ అధికారి, స్థానిక తహశీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆకర్షణీయంగా ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవార్డుల కోసం ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సముద్రపు కోత నిరోధానికి కట్ట నిర్మాణం

భీమవరం: నరసాపురం మండలం పెదమైనవానిలంక వద్ద కోత నిరోధానికి కట్ట నిర్మాణం కోసం టెండర్లను త్వరలో ఖరారు చేస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. శనివారం కలెక్టరేట్ నుంచి స్టీరింగ్ కమిటీ సభ్యులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెదమైనవానిలంక సముద్రం కోతపై గ్రామస్తులు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించడంతో కోత నివారణకు డెలాయిట్ టచ్ తోహ్మాట్సు ఇండియా ఎల్ఎల్‌పికి రక్షణ చర్యలు అప్పగించారని కలెక్టర్ చెప్పారు. దీనితో యాంటీ ఎరోజన్ కట్ట గోడ నిర్మాణానికి ప్రతిపాదించగా సర్వేయర్ సర్వే నిర్వహించి అలైన్‌మెంట్ గుర్తించినట్లు నాగరాణి వివరించారు. కట్ట నిర్మాణానికి ప్రతిపాదించి జూన్‌లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ ప్రారంభించిన ఏడాది పూర్తయిన తర్వాత దాని నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణతో సహా ప్రాజెక్ట్ యాజమాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల శాఖ స్వాధీనం చేసుకోవాలనే షరతుతో డెలాయిట్ ఇండియా చేపట్టనున్నట్లు చెప్పారు. కట్ట నిర్మాణానికి వచ్చిన ఆన్‌లైన్ టెండర్లను ఈ నెల 19న తెరిచి ఖరారు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

వేట నిషేధ సమయంలో రెండు నెలల పాటు గంగపుత్రులకు ప్రభుత్వం ఇచ్చే సాయమే ఆధారం. ఏటా ప్రభుత్వం ఇచ్చే మత్స్యకార భరోసా సొమ్ములు ఈ ఏడాది ఇంతవరకూ వారికి జమ కాలేదు. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకూ సముద్రంలో వేట నిషేధం కొనసాగుతోంది. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో.. కొత్త ప్రభుత్వం వచ్చాక సొమ్ములు వస్తాయని ఆశతో ఎదురుచూశారు. ఇంతవరకూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునే దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

వేటపై మాట తప్పారు



- 45 రోజులైనా మత్స్యకార భరోసా ఊసే లేదు
- గంగపుత్రుల ఇక్కట్లు.. అప్పులతో జీవనం
- వేట నిషేధ సాయం రూ.20 వేల హామీ అమలుకు డిమాండ్
- జగన్ పాలనలో ఐదేళ్ల పాటు మే నెలలోనే సాయం



నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న నరసాపురంలో దాదాపు 2 వేల మంది వరకూ పూర్తిగా వేటనే నమ్ముకుని బతుకుతున్నారు. వేట నిషేధ సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా నరసాపురంలో మత్స్యకారులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. నరసాపురం నుంచి జనసేన అభ్యర్థి బరిలో ఉండడంతో ఈ హామీని నరసాపురం ఎన్నికల సభల్లో ఊదరగొట్టారు. సీన్ కట్ చేస్తే మత్స్యకార భరోసా పెంపు మాట దేవుడెరుగు, కనీసం పాత సొమ్ములైనా ఇస్తారా? ఇవ్వరా? అని మత్స్య కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకూ లబ్ధిదారుల విషయంలో ఎలాంటి సర్వే చేయడం గానీ, లబ్ధిదారుల జాబితా ప్రకటించడం గానీ చేపట్టలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా కూడా రాలేదు.

సాగని వేట.. అప్పుల మూట

మరోవైపు జూన్ 15న వేట నిషేధం గడువు ముగిసి మళ్లీ వేట ప్రారంభించారు. మత్స్యసంపద అధికంగా లభ్యమయ్యే ప్రస్తుత సీజన్‌లో వరుసగా అల్పపీడనాలతో వేట సవ్యంగా సాగడంలేదు. దీంతో తీరంలో మత్స్యకారులు చేతిలో చిల్లిగవ్వ లేక భరోసా సొమ్ములు అందక ఎదురుచూపులు చూస్తున్నారు.

టీడీపీ గత పాలనలోనూ తిప్పలు : 2014–19 టీడీపీ హయాంలో వేట నిషేధం ముగిసి, జూన్‌లో వేట ప్రారంభమైనా.. ఐదారు నెలల తరువాత సాయం అందించేవారు. అదీ కొద్దిమందికి మాత్రమే. ఈ పరిస్థితిని జగన్ ప్రభుత్వం మార్చింది. మత్స్యకారులు ఖాళీగా ఉండే మే నెలలోనే మత్స్యకార భరోసా అమలు చేసింది. జగన్ ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమలో 5 ఏళ్లలో 6,427 మందికి రూ 7.87 కోట్లు అందించారు. టీడీపీ 2014–19లో రూ.12.98 లక్షలు మాత్రమే సాయం ఇచ్చింది.

గత ఐదేళ్లలో రూ.7.87 కోట్ల సాయం

2019లో అధికారంలోకి జగన్ వచ్చే సమయానికే వేట నిషేధం అమల్లో ఉండటంతో ఆ ఏడాదే మత్స్యకార భరోసా పథకాన్ని జగన్ అమలు చేశారు. కేవలం 173 మంది ఉన్న లబ్ధిదారుల సంఖ్యను 1072కు పెంచి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున అందించారు. ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం మత్స్యకార భరోసాను అమలు చేసింది. వేట నిషేధం అమల్లో ఉండే మే నెలలోనే బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేశారు.

మత్స్యకార భరోసా

జగన్ హయాంలో..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ.లలో)
2019	1072	1.72 కోట్లు
2020	1092	1.92 కోట్లు
2021	1200	1.20 కోట్లు
2022	1400	1.40 కోట్లు
2023	1635	1.63 కోట్లు

టీడీపీ హయాంలో..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ.లలో)
2014	–	–
2015	52	1.04 లక్షలు
2016	46	0.92 లక్షలు
2017	104	4.1 లక్షలు
2018	176	6.92 లక్షలు

రూ.20 వేలు ఎప్పుడిస్తారు



మాకు వేట సాయం రూ.20 వేలు ఇస్తామన్నారు. వెంటనే సాయం అందించి ఆదుకోవాలి. ఈ ఏడాది మాకు వేట కలిసిరాలేదు. పస్తులు ఉంటున్నాం. రెండు నెలలు వేట నిషేధంతో ఖాళీగా ఉన్నాం. నెలన్నర నుంచి వర్షాలు, వరదలతో వేట సాగడంలేదు.
– తిరుమాని గంగరాజు, మత్స్యకారుడు, వేట కార్మికుడు

మే నెలలోనే సాయం చేసేవారు



చిన్నప్పటి నుంచి వేట తప్ప నాకు మరేమీ తెలియదు. వేసవిలో రెండు నెలలు వేట ఉండదు. జగన్ సర్కార్ మాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున రూ.50 వేలు వేట నిషేధం సాయం ఇచ్చారు. ఏటా మే నెలలో సొమ్ములు అకౌంట్‌లో పడేవి. ఈ ఏడాది ఇంకా రూపాయి కూడా ఇవ్వలేదు.
– శంకరపు శ్రీనివసారావు, మత్స్యకారుడు, నరసాపురం

భరోసా సాయం కోసం ఎదురుచూపులు



మత్స్యకార భరోసా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నాం. ఐదేళ్ళు మాకు ఏ ఇబ్బంది లేదు. మే నెలలోనే సొమ్ములు అకౌంట్‌లో పడేవి. వేట సాయం రూ.20 వేలు ఇస్తామంటే ఆశపడ్డాం. పైసా సాయం ఇవ్వలేదు. మరోవైపు తుఫాన్‌లు, వరదలతో వేట సాగడంలేదు. ఏం చేయాలో అర్థం కావడంలేదు.
– గాది ముత్యాలరావు, మత్స్యకారుడు, పేరుపాలెం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో జైళ్లు నింపుతున్నారు

- చంద్రబాబు హామీలు విస్మరించి అక్రమార్జనకు తెరతీశారు
- టీడీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం



నూజివీడు సబ్‌జైలు వద్ద మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్

నూజివీడు: టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడాన్ని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ జెండా మోసిన అమాయకులైన కార్యకర్తలందరినీ ఇబ్బంది పెట్టడమే ముఖ్యమంత్రి చంద్రబాబు పనిగా పెట్టుకున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు పేర్ని నాని ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా గన్నవరంలో టీడీపీ ఆఫీసుపై దాడి చేశారంటూ పోలీసులు పలువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, వారికి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో 15 మందిని నూజివీడు సబ్‌జైలులో ఉంచారు. వారిని పరామర్శించేందుకు మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శనివారం నూజివీడు సబ్‌జైలుకు వచ్చి ములాఖత్‌లో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో జైళ్లను నింపే పని తప్ప చేస్తున్నదేమీ లేదన్నారు. అక్రమార్జనే లక్ష్యంగా ఇసుక, మట్టి ఎక్కడ ఉందని.. లేఅవుట్‌లు, అపార్ట్‌మెంట్లు ఎక్కడ కడుతున్నారో అనే ఆలోచన తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గన్నవరంలో వైఎస్సార్‌సీపీ ఆఫీసుపై దాడి చేయడానికి వచ్చిన టీడీపీ గూండాలను అడ్డుకోవడానికి మాత్రమే ఆనాడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వచ్చారన్నారు. పార్టీలో చురుగ్గా ఉన్న నాయకులను, కార్యకర్తలను జైళ్లలో వేయడానికి టీడీపీ ప్రభుత్వం పోలీసులను దారుణంగా వాడుతుందన్నారు. రిమాండ్‌లో ఉన్న కార్యకర్తలను, నాయకులను కలిసి రమ్మని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. కార్యకర్తలు కూడా ధైర్యంగా ఉన్నారని, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ జెండాను వదిలేది లేదని చెప్పారన్నారు. వల్లభనేని వంశీని అరెస్ట్ చేసినట్లు వచ్చే వార్తలపై విలేకరులు అడగగా ఇవన్నీ శునకానందం పనులని, రెండు సంవత్సరాల క్రితం కొడాలి నాని మాతృమూర్తి క్యాన్సర్‌తో బాధపడుతుంటే ఆవిడ చికిత్స కోసం తిరిగే సమయాల్లో క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్న కొడాలి నాని అని ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు ఆమె క్యాన్సర్‌ను జయించి ఆరోగ్యంగా ఉన్నారన్నారు. వల్లభనేని వంశీపై కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని, వంశీపై అన్యాయంగా కేసు పెట్టారని, ఆయన న్యాయపరంగా రిలీవ్ అవ్వటానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

పింఛన్ల సొమ్ము ఎగ్గొట్టారు

పెన్షన్.. టెన్షన్

- రెండ్రోజులకే పింఛను పంపిణీ క్లోజ్
- ఆస్పత్రిలో ఉన్నా అత్యవసరంగా ఊరెళ్లినా నో పెన్షన్
- గత నెలలో పింఛను అందుకోని లబ్ధిదారులు 775 మంది
- ఆగస్టులో వస్తుందని ఎదురుచూసినా నిరాశే
- గత ప్రభుత్వ హయాంలో ఏడో తేదీ వరకు పంపిణీ



ఆగస్టులో 1,883 మందికి అందని పింఛన్

ఆగస్టులో జిల్లాలో 2,31,874 మందికి పింఛన్లు అందించాల్సిఉండగా 2,29,991 మందికి అందించారు. 1,883 మంది లబ్ధిదారులకు సుమారు రూ.75.30 లక్షలు ఇవ్వాల్సివుండగా ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. సెప్టెంబరులో అయినా బకాయిల సొమ్ము చెల్లించాలని కోరుతున్నారు.

భీమవరం: వివిధ కారణాలతో జూలైలో పింఛను సొమ్ము అందుకోలేకపోయిన లబ్ధిదారులు.. ఆ డబ్బులు ఆగస్టులో ఇస్తారని ఆశగా ఎదురుచూశారు. కేవలం రెండు రోజులకే పింఛన్ పంపిణీ పరిమితం చేయడంతో జూలై నెలలో కొందరు రూ.7 వేలు తీసుకోలేకపోయారు. వివిధ కారణాలతో ఊరెళ్లినవారు, చికిత్స కోసం ఆస్పత్రుల్లో ఉన్నవారు.. ఇలా వందలాది మంది నష్టపోయారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడో తేదీ వరకు పింఛను సొమ్ము పంపిణీ చేయడంతో అదే నమ్మకంతో ఉన్నవారు రెండు రోజుల తర్వాత పింఛను కోసం వచ్చినా.. పంపిణీ నిలిపేశామని చెప్పారు. ఆ సొమ్ము ఈ నెలలో ఇస్తారని ఎదురుచూడగా.. రూ.4 వేలు మాత్రమే చేతిలో పెట్టడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత నెలలో పింఛన్ అందుకోని వారు. పశ్చిమగోదావరి జిల్లాలో 775 మంది ఉండగా, వారు నష్టపోయిన సొమ్ము రూ.54 లక్షలకు పైగానే ఉంది.

రెండు రోజుల్లో అందకుంటే అంతే

పశ్చిమగోదావరి జిల్లాలో వృద్ధులు, వితంతువులు, వికలాంగ పింఛనుదారులు 2,31,874 మంది ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున ఆగస్టు పింఛను సొమ్ము రెండు రోజుల్లో సుమారు రూ.97 కోట్ల వరకు పంపిణీ చేశారు. గత నెలలో 217 మందికి తలుపులు తాళం వేసి ఉండడంతో పింఛన్ ఇవ్వలేదు. 163 మంది ఆసుపత్రుల్లో ఉండడం, 256 మంది ఇతర ప్రాంతాల్లో ఉండటం, 121 మంది ఇతర కారణాలతో పింఛను సొమ్ము అందుకోలేకపోయారు. ఈ విధంగా పింఛను అందుకోనివారు డయాలసిస్ పేషెంట్లతో కలిపి మొత్తం 775 మంది ఉన్నారు. వీరందరికీ కలిపి రూ.54 లక్షలు పైగానే పింఛను సొమ్ము ఇవ్వాల్సి ఉంది. జూలైలో అందుకోలేకపోయిన సొమ్ము ఆగస్టులో తీసుకోవచ్చని అందరూ ఎంతో ఆశగా ఎదురు చూడగా, ఆగస్టు సొమ్ము మాత్రమే చేతిలో పెట్టడంతో పింఛనుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

గతంలో 7వ తేదీ వరకు పంపిణీ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా పింఛన్లను ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దనే పంపిణీ చేయించారు. వైద్యం కోసం ఆసుపత్రిలో చేరిన రోగులకు, అనారోగ్య కారణాలతో బంధువుల ఇంటివద్ద ఉన్న లబ్ధిదారులకు వలంటీర్లు దూరప్రాంతాలకు సైతం వెళ్లి పింఛను అందించారు. అప్పట్లో ఏడో తేదీ వరకు పింఛను సొమ్ము పంపిణీ చేయడంతో దూరప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులు సైతం వచ్చి వాటిని అందుకునే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం ఫించన్ సొమ్ము పెంచామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నా రెండు రోజులకే పంపిణీ పరిమితం చేయడంతో అనేకమంది లబ్ధిదారులు పింఛను కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులందరినీ ఒకేచోటకు రప్పించి రాజకీయ నాయకులతో పంపిణీ చేయించడంతో తీవ్ర జాప్యం జరగడం వల్ల వృద్ధులు, వికలాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఎక్కువ రోజులు పింఛను పంపిణీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

తహసీల్దార్ల బదిలీ

భీమవరం: జిల్లాలో 21 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలాల వారీగా కొత్తగా వచ్చిన తహసీల్దార్ల వివరాలు...

మండలం	తహసీల్దార్
భీమవరం	రవి రాంబాబు
వీరవాసరం	ఎ.వి. రామాంజనేయులు
ఉండి	కె.నాగార్జున
పాలకోడేరు	ఎస్.భరత విజయలక్ష్మి
ఆకివీడు	ఎస్.వెంకటేశ్వరరావు
గణపవరం	వై.కె.వి.అప్పారావు
నర్సాపురం	నీలాపు గురుమూర్తి
మొగల్తూరు	సీహెచ్ విద్యాపతి
పాలకొల్లు	వై.దుర్గా కిషోర్
పెనుగొండ	జి.అనిత కుమారి
పెనుమంత్ర	వై.రవికుమార్
పోడూరు	సయ్యద్ మౌలానా ఫాజిల్
తాడేపల్లిగూడెం	ఎం.సునీల్ కుమార్
పెంటపాడు	ఏడిద శ్రీనివాస్
తణుకు	డీవీఎస్ఎస్ అశోక్ వర్మ
ఇరగవరం	ఎం.సుందర్ రాజు

ఐటీఐల్లో ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకూ రెండు విడతల్లో జరిగిన ప్రవేశాల అనంతరం మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం మూడో విడత కౌన్సెలింగ్‌కు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి జూనియర్ లైన్‌మేన్ మృతి



యల్లా రాజు మృతదేహం

పెనుగొండ: భీమలాపురం గ్రామంలో సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా వల్ల షాక్‌కు గురై జూనియర్ లైన్‌మేన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం భీమలాపురంలో జూనియర్ లైన్‌మెన్‌గా యల్లా రాజు (30) పనిచేస్తున్నాడు. శనివారం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. అయితే ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడుకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోనాలలో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

తణుకు: కోనాల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన వెలుసూరి శ్రీను శుక్రవారం రాత్రి కొండాలమ్మ గుడి సెంటర్‌లో కూల్‌డ్రింక్ తాగుతుండగా పాత గొడవల నేపథ్యంలో అటుగా వచ్చిన కండెల్లి నానితోపాటు మరో ఐదుగురు అతనిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ క్రమంలో అడ్డువెళ్లిన మెరిపే అమృతరావుపైనా దాడి చేసిన ఆరుగురు అతని మెడలో బంగారు చైన్, ఉంగరం, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీనిపై బాధితుడు అమృతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ కూలీ మృతి




పసుపులేటి వెంకటరమణ మృతదేహం

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటరమణ (32) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి స్థానికంగా ఉన్న బైపాస్ రోడ్డును దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం వెంకటరమణను ఢీకొంది. తలకు తీవ్ర గాయం కావడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి సందడి

షురూ





విద్యుద్దీపాల అలంకరణలో శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండపం (ఫైల్)

- రేపటి నుంచి శ్రావణమాసం, 7 నుంచి శుభ ముహూర్తాలు
- శ్రీవారి క్షేత్రంలో ఈ నెల 8, 18, 22 తేదీల్లో ఆల్ ఫుల్
- ఈనెల దాటితే వచ్చే ఏడాది వరకు మంచి ముహూర్తాలు లేనట్టే

ద్వారకాతిరుమల : ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక ఇన్ని రోజులూ శుభకార్యాలకు బ్రేక్ పడింది. దీంతో పెళ్లి బాజాలు మోగక కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధారపడ్డ వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి. అయితే ఈనెల 5వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండటంతో 7 నుంచి వివాహాది శుభకార్యాలు మొదలవనున్నాయి. 7వ తేదీ నుంచి 28 వరకు మాత్రమే మంచి ముహూర్తాలు ఉన్నాయని, ఇవి దాటితే మళ్లీ వచ్చే ఏడాది జనవరి 30 వరకూ ఆగాల్సిందేనని పురోహితులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారు తమ పిల్లల వివాహాలను ఈ మూహూర్తాల్లోనే జరిపించాలని తొందరపడుతున్నారు.

క్షేత్రంలో ఆల్ ఫుల్..

గత ఏప్రిల్ నుంచి మూఢంతో పాటు సరైన ముహూర్తాలు లేక పెళ్లి బాజాలు మోగలేదు. గత నెల 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం (శూన్యమాసం) కావడంతో ముహూర్తాలు లేవు. దాంతో వివాహాలు, శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాల ప్రారంభం, రిజిస్ట్రేషన్లు, నామకరణలు ఇతర శుభకార్యాలన్నింటికీ బ్రేక్ పడింది. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రవేశిస్తుండటంతో వాటిని జరుపుకునేందుకు అంతా సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో ఈ నెల 8, 18, 22 తేదీల్లో భారీగా వివాహాలు జరగనున్నాయి. వాటిని పురస్కరించుకుని ఇప్పటికే కల్యాణ మండపాలు, సత్రాల్లోని గదులు, కాటేజీలు ఇలా అన్నీ బుక్ అయిపోయాయి.

మరోసారి శూన్యమాసం

శ్రావణ మాసం తరువాత సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మరోసారి శూన్యమాసం రానుంది. వినాయక చవితి పండుగ తెచ్చే భాద్రపద మాసం సైతం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఏడాది చివర డిసెంబర్ మార్గశిర మాసం కావడంతో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఫాల్గుణ మాసంలో ఫిబ్రవరి చివరి నుంచి మార్చి చివరి వరకూ వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

వ్యాపారాలపై ప్రభావం

ఈ ఏడాది వరుసగా నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ప్రధానంగా పెళ్లిళ్లపై ఆధారపడి వ్యాపారాలు సాగిస్తున్న వస్త్ర, నగల దుకాణాలు, కల్యాణ మండపాలు వెలవెలబోయాయి. పెళ్లి తంతు సాగించే పురోహితులు సైతం ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే కేటరింగ్, డెకరేషన్, వీడియో, ఫొటోగ్రాఫర్లు డీలా పడ్డారు. ప్రస్తుతం శ్రావణమాసం రానుండటం, ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో వారికి కాస్త ఊరట కలిగినట్టయ్యింది.



పచ్చిపూల మండపం

ఈనెల తప్పితే వచ్చే ఏడాదే..



ఈనెల తప్పితే వచ్చే ఏడాది వరకూ మంచి ముహూర్తాలు లేవు. శుభకార్యాలు తలపెట్టుకున్న వారంతా ఈ శ్రావణమాసంలోని ముహూర్తాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 7 నుంచి 24 వరకు ముహూర్తాలు బాగున్నాయి. అందులో 8, 11, 15, 18, 23, 24 తేదీల్లోని ముహూర్తాలు బలమైనవి.

– గోవిందవఝుల వెంకటరమణమూర్తి శర్మ, పురోహితులు, ద్వారకాతిరుమల

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ప్రభావం



శ్రీవారి ఆలయంలో నామమాత్రంగా ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని భక్తుల రద్దీపై అమావాస్య ఎఫెక్ట్ పడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి శనివారం వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శిస్తుంటారు. అయితే అమావాస్య ముందురోజు కావడంతో ఈ వారం శ్రీవారిని భక్తులు నామమాత్రంగా దర్శించారు. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకు నామమాత్రంగా కొనసాగింది. ఆ తరువాత ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి.

బాధిత కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



రమణక్కపేటలో చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు : టీడీపీ మూకల దాడుల్లో గాయపడిన బాధితులకు, కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు భరోసా ఇచ్చారు. ఎన్నికల అనంతరం టీడీపీ శ్రేణుల దాడుల్లో గాయాలపాలై చికిత్స పొంది కోలుకున్న కుటుంబాలను శనివారం సాయంత్రం పార్టీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలతో కలిసి పరామర్శించారు. రమణక్కపేటకు చెందిన ఉప్పే సుబ్బారావు, కాట్రేనిపాడుకు చెందిన అమర్తల శ్రీనివాసరావు కుటుంబాలను ఆయన సందర్శించి, వారికి ధైర్యం చెప్పి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున పంపిన మొత్తం రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యులు డా.వరికూటి ప్రతాప్, సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వ్యవసాయ సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు: అలుగులగూడెం రైల్వేగేటు సమీపంలో శనివారం రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఏలూరు రైల్వే ఎస్సై పీ సైమన్ చెప్పారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు, కోలముఖం, నల్లని జుట్టు, సామాన్య దేహదారుఢ్యం, నలుపురంగు, పొట్టి చేతుల టీ షర్టు, బిస్కెట్ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 99892 19559 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

ఏజెన్సీలో విజృంభిస్తున్న వ్యాధులు

- పెరుగుతున్న మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డెంగీ కేసులు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రులు



కామెర్లు, టైఫాయిడ్, మలేరియా జ్వరంతో వైద్యం పొందుతున్న చిన్నారి



టైఫాయిడ్ జ్వరానికి వైద్యం పొందుతున్న కేఆర్‌పురానికి చెందిన చైతన్యరాజు

బుట్టాయగూడెం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గతకొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలోని మార్పులతోపాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించడంతో వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు బయట ప్రాంతంలోని ప్రైవేటు ఆస్పత్రులు సైతం రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆస్పత్రుల బెడ్‌లు జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం, దొరమామిడి ప్రభుత్వాస్పత్రి, పీఆర్ గూడెం, అంతర్వేదిగూడెం, నందాపుర, కేఆర్‌పురం ప్రభుత్వాస్పత్రులతోపాటు పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఆస్పత్రుల్లో మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డెంగీ జ్వరాల బారిన పడివారు వైద్యం పొందుతున్నారు.

జిల్లాలో 53 మలేరియా, డెంగీ 119 కేసులు

జిల్లాలో 53 మలేరియా కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. వీటిలో 4 గిరిజనేతర ప్రాంతంలో, 49 కేసులు గిరిజన ప్రాంతంలో నమోదైనట్లు చెప్పారు. అదేవిధంగా 119 డెంగీ కేసులు నమోదయ్యాయని, వీటిలో ఏజెన్సీలో జీలుగుమిల్లి మండలంలో ఒక కేసు నమోదు కాగా, గిరిజనేతర ప్రాంతంలో 118 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే నూజివీడు నియోజకవర్గం చాట్రాయి ప్రాంతంలో 17 చికున్‌గున్యా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో టైఫాయిడ్ 8,500, కామెర్లు 20 కేసుల చొప్పున నమోదైనట్లు చెబుతున్నారు. అయితే ఇవి అధికారికంగా నమోదైనవి కాగా, అనధికారికంగా ఇంకా అనేక కేసులు ఉన్నాయంటున్నారు.

మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా



నేను మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాను. కుటుంబ సభ్యుల సాయంతో బుట్టాయగూడెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రికి వచ్చి వైద్యులకు చూపించుకున్నాను. ఇక్కడ పరీక్షలు చేయించుకోగా, టైఫాయిడ్ జ్వరం అని తేలింది. ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాను.

– పరిమి దారాలమ్మ, కృష్ణాపురం, బుట్టాయగూడెం మండలం

పరీక్షల్లో టైఫాయిడ్, మలేరియా అని తేలింది



నాకు ఉన్నట్టుండి తీవ్రమైన చలిజ్వరం వచ్చి భరించలేని ఒళ్లనొప్పులతో బాధపడ్డాను. కుటుంబసభ్యులు నన్ను బుట్టాయగూడెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రిలో చేర్పించగా, వైద్య పరీక్షలు చేసి టైఫాయిడ్, మలేరియా అని నిర్ధారించారు. మూడు రోజులుగా చికిత్స తీసుకుంటున్నా.

– కానెం సూరిబాబు, మంగయ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

చోరీకి వచ్చి వృద్ధురాలిపై అత్యాచారం

- పాలకొల్లు చోరీ కేసులో దొంగల అఘాయిత్యం
- సీసీ ఫుటేజీ పరిశీలన వెలుగులోకి వచ్చిన వైనం
- ఘటనలో ముగ్గురి అరెస్టు.. చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



పాలకొల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో వారం క్రితం ఓ ఇంట్లో జరిగిన చోరీ ఘటనలో వృద్ధురాలిని హత్య చేసేందుకు ప్రయత్నించడమే కాక అనారోగ్యంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెపై ఓ దొంగ అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఈ కేసు దర్యాప్తులో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి చెప్పారు. పాలకొల్లులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బొండాడ వారి వీధిలో గిరిజాల నాగ వెంకట మీనాక్షిదేవి ఇంట్లో కింద పోర్షన్‌లో ఆమె తల్లి ఓ 75 ఏళ్ల వృద్ధురాలు, ఆమెకు సహాయంగా ఒక ఆయా ఉంటోంది. గత నెల 29వ తేదీ భోజనం ఆయా పైపోర్షన్‌లోకి వెళ్లిన సమయంలో అక్కడే అప్పటివరకు తచ్చాడిన అమలాపురానికి చెందిన బొక్కా రాజు, పాలకొల్లుకు చెందిన మీసాల మావుళ్లు వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డారు. ముందుగా సెల్ఫ్‌లో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించి జేబులో పెట్టుకున్నారు. పక్కనే మంచంపై అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలి మెడలో బంగారాన్ని చూసి దొంగిలించాలనే ఉద్దేశంతో బొక్కా రాజు ఆ వృద్ధురాలిపై ఎక్కి కూర్చుని ఆమె పీక నొక్కాడు. ఆమె ముఖంపై దిండు వేసి నొక్కారు. అ తరువాత బొక్కా రాజు మీసాల మావుళ్లతో వృద్ధురాలిపై ఇంటి వెనుక ఉన్న సిమెంట్ దిమ్మెను తీసుకువచ్చి తలపై రాజు బలంగా కొట్టాడు. వృద్ధురాలు స్పృహ లేని స్థితిలో ఉండగా, ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చేతి గాజులు, చెవి కమ్మెలను దొంగిలించారు. అనంతరం పక్క గదిలో ఓ బ్యాగ్‌లో ఉన్న రూ.15 వేలు నగదును అపహరించారు. మీసాల మావుళ్లతో వృద్ధురాలిని పట్టుకొమ్మని చెప్పి బొక్కా రాజు వృద్ధురాలిపై అత్యాచారం చేసి పరారయ్యారు. అనంతరం వృద్ధురాలి కుమార్తె గిరిజాల మీనాక్షి దేవి ఇంట్లో సీసీ ఫుటేజ్‌లను చూసి జరిగిన సంఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ ఫిష్ మార్కెట్ వద్ద బొక్కారాజు, మీసాల మావుళ్లతో పాటు రాజమండ్రికి చెందిన గుజ్జల రామకృష్ణలను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 34 గ్రాముల బంగారు గాజులు, 15 గ్రాముల గొలుసు, వెండి గంధం గిన్నెలు 2, దీపపు కుందులు 6, వెండి పూల గుత్తి, వెండి గ్లాసు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితుల అరెస్టుకు కృషి చేసిన పట్టణ సీఐ కె.మంగాదేవి, ఎస్సైలు బాదం శ్రీనివాసు, వెంకటరమణ, శివన్నారాయణలను ఎస్పీ అభినందించారు. అడిషినల్ ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై వరి విత్తనాలు



మార్టేరులో మాట్లాడుతున్న డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర: అధిక వర్షాలు ఉన్న ప్రాంతాల్లో రైతులకు 80 శాతం రాయితీపై స్వల్పకాలిక రకాల విత్తనాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పరిశోధనా సహసంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బెంగాల్ ఊడ్పులో రైతులు నత్రజని ఎక్కువగా వాడుతున్న నేపథ్యంలో దీనిపై పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాస్త్రవేత్తలను కోరారు. ఆరుతడి పద్ధతిలో వరి పండించే పరిజ్ఞానాన్ని పొలంబడిలో ప్రవేశపెట్టాలని ఆయన సభలో శాస్త్రవేత్తలకు సూచించారు. వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమానికి శాస్త్రవేత్తలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి జీవన ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల ఎకరాకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ఆదా చేయవచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాల కారణంగా దెబ్బతిన్న వరిచేలను మార్టేరు శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, కొన్నిచోట్ల రైతులు సకాలంలో నాట్లు వేయలేకపోవడం వల్ల నారుమడులు కుళ్లిపోయాయని, ఈ పరిస్థితుల్లో 40 రోజులు దాటి నాటితే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. వరిచేలు దెబ్బతిన్న రైతులు పీఆర్ 126 రకం సాగుకు మొగ్గుచూపుతున్నారని, అటువంటి ప్రాంతాలలో బ్యాక్టీరియా ఎండాకు తెగులుపై అవగాహన కల్పించాలని కోరారు. పొటాష్ వాడకం ఆవశ్యకత ఎంతైనా ఉందని, దీనివల్ల పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. ఎంటీయూ 1312, పీఆర్ 126 రకాలకు నత్రజని తక్కువగా వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత వరిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వరి ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ వి.భువనేశ్వరి, ఎస్.శ్రీనివాసరావు, ఎ.ఆనంద్‌కుమార్ వివరించారు. డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉండి: తన ఇంటి సమీపంలో ఉన్న ఓ ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేసిందనే కారణంగా ఓ మహిళపై ఫ్యాక్టరీకి చెందిన కొందరు దాడి చేశారు. వివరాల ప్రకారం ఉణుదుర్రు గ్రామానికి చెందిన సాలిమట్ల నాగలక్ష్మి అనే మహిళ తమకు సమీపంలో ఉన్న పాలకోడేరు మండలంలోని ఓ ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వస్తోందని గతంలో కోర్టులో ప్రైవేట్ పిటీషన్ దాఖలు చేసింది. అప్పటి నుంచి ఫ్యాక్టరీకి చెందిన కొందరు ఆమెను అనేకసార్లు బెదిరించారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఫ్యాక్టరీకి చెందిన కర్తాక ఏసు మరో నలుగురు ఆమె ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆమె కాళ్లుచేతులు కట్టేసి అసభ్యంగా ప్రవర్తించడమే కాక చంపుతామని బెదిరించారంటూ బాధిత మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

శాకంబరీ దేవిగా ఐశ్వర్యదుర్గామాత



అత్తిలి: ఆషాఢ మాసం సందర్భంగా అత్తిలి రామన్నపేటలో ఐశ్వర్య దుర్గ అమ్మవారిని శనివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి పలు రకాల స్వీట్లు, పండ్లుతో సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ అవసరమని ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు డాక్టర్ కేవీఎస్ఎన్ రాజు, డాక్టర్ ఎస్. ప్రశాంతిలు పేర్కొన్నారు. వారి పర్యవేక్షణలో శనివారం హెల్మెట్‌పై అవగాహన కోసం నన్నయ్య విశ్వ విద్యాలయం నుంచి బస్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తుపాకుల ఆశోక్, వివిధ విభాగాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆపన్న హస్తం



ట్రాక్టర్ మెకానిక్‌కు సాయం అందజేస్తున్న గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నా జనార్ధన్‌రావు తెలిపారు. పట్టణానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ కె.శ్రీనివాసరావు సంవత్సరకాలంగా అనారోగ్యానికి గురై ఎటువంటి ఆదాయం లేకపోవడం, కుటుంబం గడవడం కష్టంగా మారింది. వైద్య ఖర్చులకు కూడా సొమ్ములు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్పందించిన గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాతలు రాజా, గాయత్రి సహాయ సహకారాలతో రూ. 15 వేలు, భారత్ ఆటోమొబైల్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శివాజీ, నాని, గఫూర్ బాబు, ఆదిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు ఆషాఢం సారె అందజేత



ప్రత్యేక అలంకరణలో కొండాలమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, అనురాధ దంపతులు, కుమారుడు రాజేష్, కుటుంబ సభ్యులచే సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి వద్ద నుంచి ఆలయం వరకు మహిళలు ఊరేగింపుగా తరలి వచ్చారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారికి వచ్చే సంవత్సరం జాతర చేస్తామన్నారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి, భక్తులు పాల్గొన్నారు. అలాగే పట్టణ గ్రామ దేవత కొండాలమ్మ అమ్మవారికి శనివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్, మామిడితోట స్థానికులు అమ్మవారికి అషాఢ సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

80 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు



పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: నారుమడులు నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంటీయు 1153, ఎంటీయు 1156, ఎంటీయు 1010, ఎంటీయు 7029 రకాల వరి వంగడాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలని సూచించారు. వరి చేలు ముంపునకు గురై కోలుకుంటే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల ఎంవోపీ పొటాష్ వేయాలన్నారు. తద్వారా నారు త్వరగా కోలుకుంటుందన్నారు. ఇదిలా ఉంటే పంట నష్టపోయిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను రైతు సేవా కేంద్రాల్లో సమర్పించి, పంట నష్టం నమోదు చేసుకోవాలన్నారు.

బిడ్డకు తల్లిపాలే సంజీవని



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తల్లి పాలే బిడ్డ సంజీవని అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలోని కోడ్ నెం.129లో తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో తల్లిపాలు ఉపకరిస్తాయన్నారు. పుట్టి నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు పట్టించాలన్నారు. తర్వాత ఏడవ నెల నుంచి ప్రత్యామ్నాయ ఆహారం ఇవ్వాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పి.సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇ.సూర్య కుమారి, పి.ప్రమీల, పి.కనకదుర్గ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

అత్తిలి: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం వల్ల అనేక రోగాల నుంచి పిల్లలకు రక్షణ కలుగుతుందని ఏఎన్ఎం కేఆర్ స్వరూప అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు కనీసం 6 నెలలు వరకు అందించడం ద్వారా అవసరమైన పోషకాలు, ముఖ్యమైన యాంటీబాడీస్ వృద్ధి చెంది, బిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. తల్లిపాలకు దూరమైన పిల్లలు నిమోనియా, డయేరియా, వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గురించి, ఆడపిల్లల సంరక్షణ, గుడ్, బ్యాడ్ టచ్‌లు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్ఆర్‌కే కుమారి, ఎం వెంకటలక్ష్మి, జి నాగజ్యోతి, మహిళా సంరక్షణ అధికారి కె జానకిదేవి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతరాజు, ఆశా వర్కర్ డి సూర్య కుమారి పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

తణుకు టౌన్: పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందించడం ద్వారా పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అరుణ కుమారి చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ తణుకు అర్బన్ సెక్టార్ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలోని సజ్జాపురం, అజ్జరంపుంత కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు, మహిళలు పాల్గొన్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గల పైడిపర్రు సెక్టార్ పరిధిలోని దువ్వ, తేతలి, ముద్దాపురం, కోనాల, కొమరవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు, మిషన్ శక్తి, 100 రోజుల కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి, 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక దాడుల నివారణ, వంటి అంశాలపై ఆమె మహిళలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని వేల్పూరు సెక్టార్ పరిధిలో గల వేల్పూరు, మండపాక గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే కృష్ణకుమారి పాల్గొని మాట్లాడారు.

బిడ్డకు ముర్రుపాలు సురక్షితం



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న తల్లులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రసవం జరిగిన ఒక గంట లోపు బిడ్డకు సురక్షితమైన ముర్రుపాలు ఇవ్వాలని, ఆరు నెలలు వరకు తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి పలు సూచనలు చేశారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలు ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు శనివారం పట్టణంలోని మూడోవ వార్డు, ఇరవై ఐదోవ వార్డుల్లో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్‌కే దుర్గా భవాని, కె.విశాలాక్షి, మంగతాయారు, విజయకుమారి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

పెంటపాడు: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బందికి, తల్లులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ నుంచి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ తల్లిపాల వల్లే బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, జయలక్ష్మి, ముదునూరు పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



అత్తిలి: ఉరదాళ్లపాలెంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తణుకు టౌన్: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహనా ర్యాలీ



పెంటపాడు: ముదునూరు పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేడు గణపవరంలో యోగాసన పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు ఈ నెల 4వ తేదీ ఆదివారం గణపవరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ వర్తక సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ తెలిపారు. పోటీలు బాల బాలికలకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరుగుతాయని, విజేతలను సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని, జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

తణుకు: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తణుకు పట్టణానికి చెందిన ముక్కామల సుబ్బారావు శనివారం మధ్యాహ్నం స్థానిక కోర్టు ఎదురుగా రాష్ట్రపతి రోడ్డులో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బారావుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురు జూదర్ల అరెస్టు

అత్తిలి: మండలంలోని పాలూరు గ్రామం మునలమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఏఎస్సై పి సత్యనారాయణ శనివారం తెలిపారు. నిందితుల నుంచి రూ. 9 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని తణుకు కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



తణుకు రాష్ట్రపతి రోడ్డులో సిల్టు తీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: పట్టణంలోని ప్రధాన రోడ్లు వెంబడి డ్రెయినేజీలో సిల్టు తీత పనులను శనివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. ఇటీవలి కాలంలో పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లల్లో సిల్టు తీయడానికి మున్సిపల్ అధికారులను రెండు బృందాలను ఏర్పాటు చేశారు. రాబోయే 30 రోజుల్లో తణుకు పట్టణంలోని మొత్తం అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో సిల్టు తీసేవిధంగా ప్రణాళికలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ పాల్గొన్నారు.

తణుకు తహసీల్దార్‌గా అశోక్‌వర్మ

తణుకు: తణుకు మండల తహసీల్దార్‌గా డీవీఎస్ఎస్ అశోక్‌వర్మను నియమిస్తూ శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రావులపాలెం తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై తణుకు రానున్నారు. గతంలో తణుకు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఆయన అనంతరం పెనుమంట్ర తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ ముక్తేశ్వరరావును తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థినీలకు ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలకు శనివారం తణుకు డిపో వారు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 273 మంది విద్యార్థినీలకు జనసేన మండల అధ్యక్షుడు దాసం ప్రసాద్ ఆర్థిక సహాయంతో బస్‌పాస్‌లు అందజేసారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని గుడిమెట్ల విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా దాత దాసం ప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన వారికి రూ. 10 వేలు ప్రోత్సాహ బహుమతి ఇస్తున్నానని, ఈఏడాది ఇదే పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినవారికి రూ. 50 వేలు ప్రోత్సాహ బహుమతి ఇచ్చి, రెండు సంవత్సరాలు ఇంటర్‌మీడియట్‌కి అయ్యే ఖర్చును తానే భరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కిలిమి శ్రీనివాసరావు, దిరిశాల వెంకట్, సత్తిబోసు, గంటా సత్యనారాయణ, తిరుపతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తేరుకున్న పంట పొలాలు



మీనవిల్లూరు, కొండేపాడు గ్రామాల్లో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

పెంటపాడు: మండలంలో ముంపునకు గురైన పంట పొలాలు వరదనీటి ముంపు నుంచి బయటపడ్డాయి. తుఫాను వల్ల మునిగి పాడవకుండా ఉన్న నాట్లను రైతులు కాపాడుకోవాలని గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, అగ్రికల్చర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంట పొలాలను సర్వే చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పార్థసారథి తెలిపారు. రైతులతో సిబ్బంది దెబ్బతిన్న పొలాలను సర్వే చేపట్టి జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ జాబితాను రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తదుపరి రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు గుప్తా, చిలకా శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



తణుకులో మొక్కలు నాటుతున్న లయన్స్ జిల్లా చైర్మన్ సరళాదేవి తదితరులు

తణుకు టౌన్: జిల్లా లయన్స్ క్లబ్ సేవా విభాగం చైర్మన్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో తణుకులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సరళాదేవి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తణుకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమంలో 15 మంది యువత రక్తదానం చేశారు. అనంతరం మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఇమ్‌పల్స్ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో లయన్స్ జిల్లా గవర్నర్ వేణుబాబు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు బసవ రామకృష్ణలతో పాటు జిల్లాలోని వివిధ పట్టణాలకు చెందిన లయన్స్ క్లబ్ నాయకులు, సభ్యులు పాల్గొని సరళాదేవికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగుల అలవెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లల కోసం వారికి ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల అలవెన్స్‌ల నిమిత్తం మండలంలోని, టౌన్‌లోని దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలని, తమ సెంటర్‌ను సంప్రదించాలని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. వైకల్యం ఉన్న దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్ద శిక్షణా కార్యక్రమం శనివారం దివ్యాంగుల ఇంటి వద్ద జరిగింది. బాలీశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి శనివారం దివ్యాంగుల పిల్లల ఇంటి వద్ద ప్రత్యేక శిక్షణలో భాగంగా వారికి నేర్పించాల్సిన నైపుణ్యాలను వారితో పాటు దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులకు సంబంధించి పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాల శిక్షణ కేంద్రంను సంప్రదించి, దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 99488 53229ను సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి కె సత్య కృష్ణలత


తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తణుకు కోర్టు సివిల్ జడ్జి కే సత్య కృష్ణ లత చెప్పారు. శనివారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి డి సత్యవతి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి కృష్ణలత మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండకుండా బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని చెప్పారు. ప్రస్తుతం మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో ముందున్నారని తెలిపారు. గ్రామాల్లోని మహిళా మండలి సభ్యులు మహిళలకు, పిల్లలకు సహాయం చేయాలని కోరారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే మండల న్యాయ సేవా కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆదర్శ మహిళా మండలి ప్రాజెక్ట్ అధికారి ఎం పార మాట్లాడుతూ మహిళా మండలి ద్వారా గ్రామాల్లో మహిళలకు, పిల్లల అభివృద్ధికి చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు మొదటి అదనపు పీపీ నాగ రంజిత్ కుమార్, రెండవ అదనపు జడ్జి ఏపీ నాగరాజు, స్పెషల్ జడ్జి పీఎస్‌పీ, చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో బీఎంఎస్ ప్రమోదకుమారి, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఎస్ఐలు, ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు శాంతి, సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ప్యానెల్ న్యాయవాదులు ఎన్ అజయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రిప్ పరికరాలకు పేర్లు నమోదు చేసుకోండి

తాడేపల్లిగూడెం రూరల్: రాయితీపై డ్రిప్ సూక్ష్మ సేద్య పరికరాలకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరభద్రరావు రైతులకు సూచించారు. శనివారం తాడేపల్లిగూడెంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25వ సంవత్సరానికి గాను 1500 హెక్టార్లు భౌతిక లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. 2023-24 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకుని పరిపాలన ఉత్తర్వులు పొందని రైతుల రిజిస్ట్రేషన్‌లను 2024-25 సంవత్సరానికి బదిలీ చేయబడుతుందన్నారు. ప్రస్తుత ఏడాదికి మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూలతోటకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐదెకరాల లోపు చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఐదెకరాల లోపు రైతులకు 50 శాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తామన్నారు. నెటాఫిమ్, గ్లోబల్ కంపెనీలకు చెందిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందించనున్నట్టు తెలిపారు. పరికరాల కోసం రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా ఫొటో కాపీలు జత చేసి, సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు.

ధరల మంట..!

- తగ్గని కూరగాయల ధరలు
- కొనలేక వినియోగదారులు సతమతం



తణుకులో కూరగాయల దుకాణం

తణుకు టౌన్: కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. బయట మార్కెట్లలో రోజురోజుకూ ధరలు పెరగడం తప్ప తగ్గడం లేదు. అరకొరగా తగ్గినా సాధారణ వినియోగదారులకు అందుబాటులో లేని ధరలు ఉన్నాయి. రైతుబజార్లలోనూ అదే పరిస్థితి. పట్టణంలో మార్కెట్లు నిత్యం వినియోగదారులతో కళకళలాడుతుండేది. కొద్దిరోజులుగా పెరిగిన కూరగాయల ధరలు కారణంగా మార్కెట్లకు వినియోగదారులు అంతంత మాత్రంగా వస్తున్నారు. దీంతో శనివారం మార్కెట్ బోసుపోయింది.

ఆకాశాన్నంటిన ధరలు

అన్ని కూరగాయల ధరలు బాగా పెరగడంతో సంచుల్లో సగం వరకే కొనుగోలు చేస్తున్నారు. బెండకాయ కిలోరూ.50, బరబాటికిలో రూ.50బీట్ రూట్ కిలో రూ.45, బంగాళదుంపలు కిలోరూ.50, ఉల్లి రూ.40, టమోటా రూ.40,బెండకాయలు రూ.45ధరలతో వినియోగదారులకు అందనంతగా ఉన్నాయి. వీటి ధరలు ఇలా ఉండగా అల్లం, వెల్లుల్లి ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి.

సంచులు నిండడం లేదు

పెరిగినధరల భారంతో గతంలో కిలో, అర కిలోలు చొప్పున కొనుగోలు చేసి సంచినిండా ఇంటికి తీసుకువెళ్లే వినియోగదారులు ఇప్పుడు పావు కిలోలు చొప్పున కొనుగోలు చేసి సంచికి సగం వరకే కూరగాయలు తీసుకెళ్తుండడం కనిపించింది. బజార్‌లో పెరిగిన ధరలపై నలుగురూ ఒకచోట చేరి చర్చించుకున్న దృశ్యాలు కనిపించాయి. ధరలు తగ్గకపోతే కుటుంబ పోషణ కష్టమని పలువురు నిరాశ వ్యక్తం చేశారు.

రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి



ప్రస్తుతం కూరగాయల ధరలన్నీ రూ. 50లు పైనే ఉన్నాయి. రోజూ కూలీపై జీవించే ప్రజలకు ఈ ధరలు చాలా భారంగా మారాయి. సాధారణ పరిస్థితుల వచ్చే వరకూ ప్రజలకు కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– గనసాల సింగ్, తణుకు

వర్షాలు, వరదల కారణంగా



వేసవి కాలం ముందు సరైన వర్షాలు లేకపోవడంతో కూరగాయల తోటలు ఎండిపోయాయి. తర్వాత ఎంతో కొంత తోటలు పెరిగినా అనంతరం కురిసిన భారీ వర్షాలకు కూరగాయల తోటలు మునిగిపోయి దెబ్బతినడంతో కూరగాయలు మార్కెట్‌లో రావడం తగ్గిపోయాయి. దీనితో ఉన్న కొద్దిపాటి కూరగాయలకు డిమాండ్ పెరగడంతో ధరలు పెరిపోతున్నాయి. వర్షాలు తగ్గి సాదారణ పరిస్థితులు నెలకొంటే కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది.

– నల్లాకుల గణపతిరావు, హోల్ సేల్ వర్తకుడు, తణుకు